క్లుప్తంగా

శారద ఐటీఐలో పీఎంకేవీవై సర్టిఫికెట్‌లు అందజేత



రేపల్లె రూరల్: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనం (పీఎంకేవీవై) పథకంలో భాగంగా పట్టణంలోని శారద ఐటీఐ కళాశాలలో మూడు నెలలుపాటు నిర్వహించిన వృత్తి విద్యాకోర్సులు ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంగళవారం స్థానిక కళాశాలలో టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ చేతుల మీదగా పంపిణీ చేశారు. కళాశాల కరస్పాండెంట్ వెంకట నారాయణ మాట్లాడుతూ మూడునెలల శిక్షణ తరగతులకు 105 మంది విద్యార్థులు హాజరవ్వగా 102 మంది విద్యార్థులు 98శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పరిశా వెంకటేశ్వరావు, ప్రిన్సిపాల్ జోత్న్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

వేమూరు: రైతులందరు సాగుచేస్తున్న పంటలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పంట నమోదు జరుగుతుందన్నారు. రైతులందరు గ్రామాల్లో రైతు సేవ కేంద్రానికి వెళ్లి వ్యవసాయ సహాయకులకు పొలం పాస్ పుస్తకం, కౌలు గుర్తింపు కార్డు ఇచ్చి పంట నమోదు చేయించుకోవాలన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కర్లపాలెం: సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణకు అందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని కర్లపాలెం పంచాయతీ గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకటకృష్ణ ఆదేశాలతో వారం రోజుల పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా కర్లపాలెం, సత్యవతీపేటలో మంగళవారం పంచాయతీ సిబ్బంది దోమల నివారణకు బ్లీచింగ్ చల్లి ఎబెట్ ద్రావణం పిచికారీ చేశారు. ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

23న గ్రామసభలు

కర్లపాలెం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనులు చేపట్టేందుకు కావలసిన పనులను గుర్తించేందుకు గాను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 23న కర్లపాలెం మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎ.ఎలీషాబాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ పథకంలో సీసీ రోడ్లు, హార్టీకల్చర్, సీసీ డ్రెయిన్లు, బీటీ రోడ్లు, పౌల్ట్రీ షెడ్లు, సెరీకల్చర్, కమ్యూనిటీ సోక్ ప్లీట్స్ మొదలగు పనులు గుర్తించి గ్రామసభల ద్వారా తీర్మానం ఇవ్వవలసిందిగా అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో గ్రామసభలు జరుగుతాయని ఎలీషాబాబు తెలిపారు.

ఎరువుల యాజమాన్యంపై దృష్టిపెట్టాలి



కొల్లూరు: వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్న ప్రస్తుత తరుణంలో ఎరువుల యాజమాన్య పద్ధతులపై రైతులు దృష్టి సారించి పెట్టుబడులు తగ్గించుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అక్తర్ హుసేన్ అన్నారు. మంగళవారం మండలంలోని క్రాపలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, రైతులు అనవసరమైన ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా వ్యవసాయశాఖాధికారుల సూచనలను పాటించాలని అన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ బాలాజీ ప్రకృతి వ్యవసాయం వల్ల చేకూరే ప్రయోజనాలను రైతులకు వివరించారు. మండల వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన చిరంజీవి యువత

నిజాంపట్నం: ఎన్నో సందేశాత్మక చిత్రాల్లో నటించి మంచి వినోదాన్ని అందించడమే కాకుండా సేవా కార్యక్రమాల ద్వారా నెం.1 స్థానాన్ని సాధించిన వ్యక్తి పద్మ విభూషణ్, మెగాస్టార్ చిరంజీవి అని అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల రవీంద్రబాబు తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి 69వ జన్మదిన వేడుకల్లో భాగంగా చిరంజీవి అభిమాన సంఘ నాయకుడు తోటా వెంకట రామారావు ఆధ్వర్యంలో మంగళవారం కూచినపూడి గ్రామంలో మొక్కలు నాటారు. కొలసాని కోటేశ్వరరావు, నల్లపాటి రాజశేఖర్, భేతపూడి రామారావు, నాంచారయ్య, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'కూటమి' జోక్యం.. విభేదాలకు ఆజ్యం!

- కాకర్లమూడి గ్రామ సర్పంచ్, కార్యదర్శి మధ్య తీవ్ర విభేదాలు
- కార్యాలయానికి రెండు తాళాలు వేసిన వైనం
- నిలిచిన సేవలు

కాకర్లమూడి(వేమూరు): తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి కాకర్లమూడి పంచాయతీలో విభేదాలు పొడసూపాయి. వైఎస్సార్ సీపీ సర్పంచి, వార్డు సభ్యుల పాలనకింద ఉన్న పంచాయతీని తమవైపు తిప్పుకొనేందుకు పంచాయతీ కార్యదర్శిని పావుగా వాడుకుని గొడవలకు ఆజ్యం పోశారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. తత్ఫలితంగా పంచాయతీ కార్యాలయానికి రెండు తాళాలు పడ్డాయి. వివరాల్లోకి వెళితే.. వేమూరు మండలంలోని కాకర్లమూడి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఉషా తేజశ్రీ, గ్రామ సర్పంచ్ బొల్లిముంత గంగాజలం మధ్య కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి విబేధాలు తారాస్థాయికి చేరాయి. పంచాయతీ కార్యదర్శి తెలుగుదేశం పార్టీ నాయకులు చెప్పినట్లు నడుస్తున్నారని, తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని సర్పంచ్ గంగా జలం ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో ఈ నెల 7వ తేదీన పంచాయతీ కార్యాలయానికి రెండు తాళాలు పడ్డాయి. ఈ విషయం ఎంపీడీఓ శేషగిరిరావు, పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్ దృష్టికి వచ్చింది. ఇరువురు అధికారులు గ్రామంలోకి వెళ్లి గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి మధ్య రాజీ కుదిర్చే ప్రయత్నం చేశారు. పంచాయతీ కార్యాలయం రెండు తాళాల్లో ఒకటి సర్పంచ్ వద్ద, మరొకటి పంచాయతీ కార్యదర్శి వద్ద ఉండాలని అధికారులు రాజీకి యత్నించారు. అయితే రాజీకి ఒప్పుకోని పంచాయతీ కార్యాదర్శి ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ సర్పంచ్ గంగాజలం, వార్డు సభ్యులు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు చేశారు.



పంచాయతీ కార్యాలయానికి రెండు తాళాలు వేసిన దృశ్యం

కూటమి నేతల జోక్యంతోనే..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీపై పెత్తనం చేసేందుకు రంగం సిద్ధం చేసుకొంది. పంచాయతీ కార్యదర్శిని తన వైపునకు మళ్లించుకొని పంచాయతీపై పెత్తనం చేయాలని కూటమి నాయకులు పంచాయతీ కార్యదర్శిని పావులా వాడుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



పంచాయతీ కార్యాలయం మూసివేయడంతో చెట్టు కిందే 104 వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

చెట్టు కిందే వైద్య సేవలు ..

కాకర్లమూడి గ్రామస్తులకు ప్రతి నెల 20 వ తేదిన గ్రామ పంచాయతీ కార్యాలయంలో 104 వైద్య సేవలు అందిస్తారు. గ్రామ సర్పంచ్‌కి, పంచాయతీ కార్యదర్శి మధ్య నెలకొన్న విబేధాల వల్ల పంచాయతీ కార్యాలయం మూతపడడంతో పంచాయతీ కార్యాలయం ఆవరణలోని చెట్టు వద్ద ఏర్పాటు చేసిన బల్లలపై రోగులకు సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు.

పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి

జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి హనుమంతరావు

కర్లపాలెం: పశువులకు సకాలంలో టీకాలు వేయటం వలన వ్యాధుల నుంచి రక్షించుకోగలుగుతామని బాపట్ల జిల్లా పశు సంవర్ధశాఖ అధికారి ఎం.హనుమంతరావు చెప్పారు. కర్లపాలెం మండలంలోని ఏట్రవారిపాలెం, కొత్త నందాయపాలెం గ్రామాలలో మంగళవారం జరిగిన వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి హనుమంతరావు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధులు సక్రమించే అవకాశాలు ఉన్నాయని వాటి నివారణకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలని సూచించారు. నాలుగు నుంచి 8 నెలల లోపు వయస్సు ఉన్న దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు నాలుగు నెలలు పైబడిన ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని చెప్పారు. ఈనెల 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 18వ తేదీ వరకు అన్ని గ్రామాలలో పశువైద్య సిబ్బంది పర్యటించి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారని ఆయన చెప్పారు. బాపట్ల ఏరియా పశు సహాయ సంచాలకులు డాక్టర్ టి.శంకర్‌రావు, కర్లపాలెం పశు వైద్యాధికారి డాక్టర్ ఎం.రేచల్ దివ్య, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న హనుమంతరావు

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి



నిజాంపట్నం: పశుపోషకులు తప్పనిసరిగా తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని కూచినపూడి పశువైద్యాధికారి డాక్టర్ హేమప్రియ కోరారు. మంగళవారం కూచినపూడి పశువైద్యశాలలో పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలను వేసి అందుకు సంబంధించిన పోస్టర్‌ను పశుపోషకులతో కలిసి ఆవిష్కరించారు. హేమప్రియ మాట్లాడుతూ ఈనెల 20 నుంచి సెప్టెంబర్ 20వ తేదీ వరకూ పశువులకు ఉచితంగా గాలి కుంటు వ్యాధి టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకుని పశువులకు వ్యాధి సోకకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. గాలి కుంటువ్యాధి వల్ల జరిగే అనర్థాలను పశుపోషకులకు వివరించారు. కార్యక్రమంలో జి.రత్నకుమారి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కోన రఘుపతిపై విమర్శలు సరికాదు

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి

బాపట్ల: రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి నిందలు వేసేలా ఒక వర్గం ప్రయత్నించటం సరికాదని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కోన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాఘవరెడ్డి మాట్లాడారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య జరుగుతున్న వివాదంలో ఇద్దరు వ్యక్తులు కోనపై బురదజల్లితే లబ్ధిచేకూరుతుందనే ఆలోచనతో ఆయనపై నిందలు వేస్తున్నారని కోకి ధ్వజమెత్తారు. బాపట్ల అభివృద్ధికి అనునిత్యం కృషి చేసిన కోన రఘుపతిపై ఆరోపణలు చేయటం సరికాదని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ నాయకులు వడ్డిముక్కల డేవిడ్, జోగి రాజా సూచించారు. రూ.520కోట్లతో నిర్మించతలపెట్టిన మెడికల్ కళాశాల పనులు నిలిచిపోతే పట్టించుకోకపోవటం విచారకరమన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ వివరణ కూడా లేకుండా అసత్య కథనాలను ప్రచురించడం సరికాదన్నారు. ఇదేవిధంగా కొనసాగితే న్యాయపరమైన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు తన్నీరు అంకమ్మరావు, శాయిల మురళి, కటికల యోహోషువా, ప్రవీణ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోకి రాఘవరెడ్డి

గంటా కోటేశ్వరమ్మకు నివాళి



బాపట్ల: కాంగ్రెస్‌పార్టీ బాపట్ల జిల్లా ఇన్‌చార్జి గంటా అంజిబాబు తల్లి కోటేశ్వరమ్మ మృతికి శాసనమండలి ప్రతిపక్షనేత లేళ్ల అప్పిరెడ్డి నివాళులర్పించారు. గంటా అంజిబాబును పరామర్శించారు. రాజకీయ కుటుంబానికి చెందిన కోటేశ్వరమ్మ బాపట్ల పట్టణంలో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరరావు ఉన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

కొల్లూరు: పేకాట స్థావరంపై దాడులు నిర్వహించిన కొల్లూరు పోలీసులు మంగళవారం రాత్రి పలువురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు చింతలమ్మ ఆలయం సమీపంలోని ఖాళీ ప్రదేశంలో పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్ఐ జి.ఏడుకొండలు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. 8 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 6,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తెనాలి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఫిర్యాదులు రాకుండా చూసుకోండి

తెనాలిఅర్బన్: ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని 21, 30 వార్డులలో మంగళవారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే రోడ్లపై అక్కడక్కడ చెత్త పడి ఉండటాన్ని గమనించి కొంత అసహనం వ్యక్తం చేశారు.

మానసిక పరిశుద్ధతతో భగవంతుడి దివ్యగుణాలు

బ్రహ్మకుమారీస్ సిస్టర్ సునంద

తెనాలి: ప్రతిఒక్కరూ ఆత్మస్వరూపులేనని, భగవంతుడు ప్రతి హృదయంలో విరాజమానుడై ఉన్నాడనీ, ఆయన దివ్యగుణాలను స్మరించుకుంటూ అందరూ పరమాత్మలో లీనమయి జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం, తెనాలి శాఖ నిర్వాహకురాలు సిస్టర్ సునంద సూచించారు. చేసే ప్రతి పనినీ భగవంతుని స్మరించుకుంటూ సంతోషంగా చేసినట్టయితే అన్నీ విజయాలే సాధిస్తారని చెప్పారు. రక్షాబంధన్ సందర్భంగా వివేక మహిళా కళాశాలలో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సిస్టర్ సునంద మాట్లాడారు. ధ్యానంతో ఆత్మపరిశీలన చేసుకుని, పరిశుద్ధతను, పూర్ణత్వాన్ని పొందినట్టయితే దివ్యగుణాలు అలవడి, భగవంతుడికి చేరువ కావొచ్చని బ్రహ్మకుమారీస్ సిస్టర్ తులసి వెల్లడించారు. ధ్యానం సందర్భంగా ఎలాంటి శ్రద్ధ వహించాలి? ఎలాంటి ఆలోచనలను మనసులో ప్రతిష్ఠించుకోవాలి? అనేది బ్రహ్మకుమారీస్ సభ్యుడు ఐ.వెంకటేశ్వరరావు వివరించారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ మాట్లాడుతూ, రాజస్థాన్‌లోని మౌంట్ అబూ కేంద్రంగా బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం ప్రపంచవ్యాప్తంగా సర్వమానవ సౌభ్రాత్రత్వాన్ని ఆకాంక్షిస్తూ సేవలను అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా వివేక మహిళా కాలేజీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు, ప్రిన్సిపాల్ జ్యోతి, ప్రియాంక, భవాని ప్రియాంక, భావన, ఠాగూర్, మురళి, నాగేశ్వరరావులు అతిథులను సత్కరించారు.



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో అతిథులు

'కమిటీ కుర్రోళ్లు' విజయవంతం కావడం సంతోషం

చిత్ర నిర్మాత, సినీనటి నిహారిక కొణిదెల

తెనాలి: నిహారిక ప్రొడక్షన్స్ పేరుతో తాను నిర్మాతగా నిర్మించిన తొలి సినిమా 'కమిటీ కుర్రోళ్లు' విజయవంతం కావటం సంతోషంగా ఉందని, ఆ చిత్ర నిర్మాత, సినీనటి నిహారిక కొణిదెల అన్నారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ప్రదర్శిస్తున్న స్థానిక ప్రియా కాంప్లెక్సుకు ఆమె, చిత్ర యూనిట్‌తో కలిసి మంగళవారం వచ్చారు. థియేటర్‌లోకి ప్రవేశించగానే తెనాలి రావటం సంతోషంగా ఉందన్న నిహారిక మాటలకు ప్రేక్షకులు జేజేలు కొట్టారు. ఫ్యామిలీ మెంబర్స్ అని కాకుండా మంచి సినిమా ఏదైనా తన పెదనాన్న మెగాస్టార్ చిరంజీవి చూస్తారని, ఆవిధంగా 'కమిటీ కుర్రోళ్లు' చూశాక, తమను పిలిచి అభినందించటం సంతోషకరమని చెప్పారు. బాబాయ్ పవన్ కళ్యాణ్ బిజీగా ఉండటంతో చూడలేదన్నారు. త్వరలోనే సమయం తీసుకుంటానని చెప్పారు. పెదనాన్న చిరంజీవి స్ఫూర్తితోనే తాను సినీరంగంలోకి వచ్చినట్టు నిహారిక తెలిపారు. తాను నిర్మించిన తొలి సినిమా 'కమిటీ కుర్రోళ్లు'ను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేశారు. రాయపాటి అరుణ మాట్లాడుతూ తన అన్నయ్య నాగబాబు కుమార్తె నిహారిక నిర్మాతగా సినిమా తీయటం సంతోషంగా ఉందన్నారు. సమాజంలో పరిణామాలను సినిమాలో కళ్లకు కట్టారని చెప్పారు. ఓటు హక్కును దుర్వినియోగం చేస్తే ఎలాంటి దుష్పరిణామాలు ఎదురవుతాయో? అన్నది కూడా సినిమాలో ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయవంతమైన సినిమాలు తీయాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. సినిమా దర్శకుడు యదు వంశీ మాట్లాడుతూ తమ సినిమా 'కమిటీ కుర్రోళ్ల'కు చాలాచోట్ల థియేటర్లు దొరకలేదన్నారు. తెనాలిలో మంచి థియేటరు దొరకటం ఆనందకరమన్నారు. సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సినిమాలో నటించిన సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఆశ్వర్ రచ్చిరాజు, త్రినాథ్ వర్మ, ప్రసాద్ బెహరా, మణికంఠ పరసు, లోకేష్‌కుమార్ పరిమి, శ్యామ్‌కళ్యాణ్, రఘువరన్, శివకుమార్ మట్టా, అక్షయ్ శ్రీనివాసర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మన్యం రమేష్ పాల్గొన్నారు. ప్రియా కాంప్లెక్స్ మేనేజరు దాసరి శ్రీనివాసరావు స్వాగతం పలికారు. జనసేన, టీడీపీ, బీజేపీకి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిహారిక

ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను ఆశ్రయించిన యానిమేటర్లు

విధుల నుంచి అకారణంగా తొలగించారని ఆవేదన

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల సమాఖ్య పరిధిలో పని చేస్తున్న ఆరుగురు దళిత యానిమేటర్లను అకారణంగా విధుల నుంచి తొలగించడంతో మంగళవారం వారు విజయవాడ కార్యాలయంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను ఆశ్రయించారు. భట్టిప్రోలు మండలం ఐలవరం, పల్లెకోన, కోళ్లపాలెం, జిలుగువారిపాలెం, రాచూరు గ్రామాలలో పని చేస్తున్న యానిమేటర్లు దోనె భాగ్యలక్ష్మి, యన్నం రాణి, కొమ్ము రూతమ్మ, కంచర్ల శ్రీలత, పులివర్తి మంజూష, చిలకా సుధారాణిలు మాట్లాడుతూ గత జులై 30వ తేదీన తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే ఏపీఎం జి.శ్రీమన్నారాయణ, సీసీలు హనోకు, రజనీ కుమారిలు తొలగించారని ఇలా అకస్మాత్తుగా ఉద్యోగంలో నుంచి తొలగించడంమే కాక మీచేతనైనది చేసుకోండని బెదిరింపు ధోరణితో మాట్లాడారని అన్నారు. అంతేకాకుండా పుస్తకాలు ఇవ్వకపోతే కేసులు పెట్టి జైలులో పెట్టిస్తామని బెదిరించినట్లు చెప్పారు. గత ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోయినా పని చేస్తున్నామని ఇలా అకస్మాత్తుగా తమను ఉద్యోగం నుంచి తొలగిస్తే కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇష్టమైన వారిని ఉద్యోగంలో చేర్పించుకునేందుకు ఇష్టం లేని వాళ్లను విధుల నుంచి తొలగించుకునేందుకు మాకు హక్కులు ఉన్నాయని మండల సమాఖ్య అధికారులు చెప్పిన విషయాన్ని చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి యధావిధిగా తమను ఉద్యోగంలోకి తీసుకోవాలని, జీతాలు ఇప్పించి జీవనాధారం కల్పించి న్యాయం చేయాలని విక్టర్ ప్రసాదుకు విన్నవించుకున్నారు. ఈ విషయమై ఏపీఎం జి.శ్రీమన్నారాయణను వివరణ కోరగా యానిమేటర్ నియామకం, తొలగింపు కానీ మండల సమాఖ్య సిబ్బందికి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. ఆ గ్రామ సంఘం కార్యనిర్వాహక సభ్యుల అభీష్టం మేరకు తొలగింపులు, చేరికలకు సంబంధించి నిర్ణయాధికారం వారికే ఉంటుందని చెప్పారు. ఇందులో తమ ప్రమేయం ఉండదన్నారు. ఎంపిక చేసిన వారిచే పనులు చేయించుకునే అధికారం మాత్రమే తమకు ఉందని అన్నారు.



ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న దళిత యానిమేటర్లు

కార్పొరేషన్ నుంచి మంజూరైన ట్రాక్టర్లు ఎక్కడ?

వాటిపై సమగ్ర విచారణ చేయాలని భట్టిప్రోలు పంచాయతీ పాలకవర్గం తీర్మానం

భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా 2018లో మంజూరైన రెండు ట్రాక్టర్లు నాటి నుంచి నేటి వరకు ఆచూకీ లేనందున అవి ఎక్కడ ఉన్నాయో విచారించాలని భట్టిప్రోలు పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. లేని ట్రాక్టర్లకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి భట్టిప్రోలు గ్రామ పంచాయతీకి వచ్చిన నోటీసులపై మంగళవారం పంచాయతీ అత్యవసర సర్వసభ్య సమావేశం జరిగింది. సర్పంచ్ దారా రవి కిరణ్మయి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి 16 మందికి గాను 9 మంది వార్డు సభ్యులు హాజరయ్యారు. లేని ట్రాక్టర్లకు భట్టిప్రోలు పంచాయతీకి నోటీసులు రావడంపై ప్రధానంగా చర్చ జరిగింది. అప్పటి పాలక వర్గం, అధికారులు గ్రామ ప్రజలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వ్యవహరించిన తీరు చట్ట విరుద్ధంగా ఉందని ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ట్రాక్టర్లకు మొదటి విడత చెల్లింపులు ఏ విధంగా జరిగాయో, ఎస్సీ కార్పొరేషన్ పంపిన నోటీసులలో రెండు ట్రాక్టర్లకు, ట్రాలీలకు పంచాయతీ చెల్లించాల్సిన బాకీ విషయం ఏమిటని సభ్యులు పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావును ప్రశ్నించారు. దీనిపై ఆయన నాడు స్పెషల్ ఆఫీసర్ పాలనలో ఈ ట్రాక్టర్ల మంజూరు జరిగిందని చెప్పుకు వచ్చారు. లబ్ధిదారులు గతంలో పంచాయతీ సిబ్బందిగా పని చేసి ఉండలేదని పలువురు సభ్యులు పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పాలకవర్గ సభ్యులు సమావేశంలో తీర్మానించారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఎంపీపీ లలిత కుమారి

వెల్లటూరు(భట్టిప్రోలు): ప్రస్తుతం సీజనల్ వ్యాధుల ప్రమాదం పొంచి ఉన్న దృష్ట్యా వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి తగు సూచనలు చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ, చైర్‌పర్సన్ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. మంగళవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు పీహెచ్‌సీలో వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వైద్య ఆరోగ్య సిబ్బంది తమకు నిర్దేశించిన ఏరియాల్లో ఇంటింటికి తిరిగి ప్రతి కుటుంబాన్ని పలకరించాలని అన్నారు. ప్రభుత్వ వైద్యశాలల పట్ల ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించి సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని అన్నారు. అనంతరం సిబ్బందితో ఎంపీపీ, వైద్యురాలు కలసి కోల్‌కత ఘటనలో బాధితురాలికి న్యాయం జరగాలంటూ కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ వైద్యురాలు చావలి రామలక్ష్మి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీపీ లలిత కుమారి, వైద్యురాలు రామలక్ష్మి, వైద్యసిబ్బంది

స్కూల్ ఆటోల డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

తెనాలిరూరల్: తెనాలిలో ఆటోల తనిఖీల స్పెషల్ డ్రైవ్‌ను రవాణా శాఖ అధికారులు మంగళవారం చేపట్టారు. మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు తమ సిబ్బందితో కలసి ఆటోలను తనిఖీ చేశారు. ముఖ్యంగా స్కూల్ ఆటోల డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న పలు ఆటోలను గుర్తిస్తే అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. 12 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులను కేవలం ఆరుగురిని మాత్రమే ఆటోలో ఎక్కించుకోవాలని, డ్రైవర్ వెంబడి, వెనుక డోర్ తెరచి విద్యార్థులను ఎక్కించుకోకూడదని డ్రైవర్లకు సూచించారు. విద్యార్థుల బ్యాగులు, లంచ్ బాక్సులు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనానికి బయట వేలాడదీయకూడదన్నారు. నిబంధనలు పాటించని డ్రైవర్లపై ఖచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలానే ప్రయాణికుల ఆటోలకు వెనుక డోర్ తీయకూడదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూదని స్పష్టం చేశారు. ఓవర్‌లోతో వెళుతున్న స్కూల్ ఆటో, లైసెన్సు లేకుండాడ ఆటోలను నడుపుతున్న ఇద్దరు డ్రైవర్లను గుర్తించి రూ. 20 వేలు జరిమానా విధించారు.



స్కూల్ ఆటోను తనిఖీ చేస్తున్న ఆర్టీఓ రాఘవరావు

2030 నాటికి మలేరియాను దేశం నుంచి పారదోలుదాం

జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: 2030 నాటికి మలేరియా రహిత భారతదేశంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం, తెనాలి డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణలు పేర్కొన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బుర్రిపాలెం రోడ్డులోని మలేరియా కార్యాలయం నుంచి మంగళవారం నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చెడు గాలి వలన మలేరియా సోకుతుందని భావించేవారని, అనంతరం సర్ రోనాల్డ్ రాస్ శాస్త్రవేత్త పరిశోధనల అనంతరం ఆడ అనాఫిలిస్‌దోమ కాటు వల్ల ఇది సోకుతుందని నిర్ధారించినట్లు తెలిపారు. ఆయన చేసిన పరిశోధన వలన ప్రభుత్వం నోబెల్ బహుమతి ఇచ్చిందని చెప్పారు. నీటి నిల్వలు ఎక్కువగా ఉండటం వలన దోమల సంతతి పెరిగే అవకాశం ఉందన్నారు. మలేరియాను దేశంలో దాదాపు నిర్మూలించడం జరిగిందన్నారు. 2027 నాటికి జీరో కేసులు ఉండే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మలా మాట్లాడుతూ దోమల నియంత్రణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. డాక్టర్ బీబీ జాన్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అన్నపూర్ణ

ఇంటింటి సర్వేకి బీఎల్‌ఏలు అందుబాటులో ఉండాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులపై జరుగనున్న ఇంటింటి సర్వేకి బూత్ లెవల్ ఆఫీసర్లకు బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ) అందుబాటులో ఉండేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సూచించారు. నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం తహసీల్దార్ సమావేశమయ్యారు. బీఎల్‌వోల ఆధ్వర్యంలో అక్టోబర్ 18వ తేదీ వరకు నియోజకవర్గంలో ఇంటింటి ఓటరు సర్వే జరుగుతుందని, గతంలో తొలగించిన కొన్ని పోలింగ్ కేంద్రాలను తిరిగి ఏర్పాటు చేయడం, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రెండో శనివారం, అన్ని ఆదివారాలు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, సర్వేలో వచ్చిన అభ్యంతరాలను డిసెంబరు 24లోగా పరిష్కరించాల్సి ఉంటుందని తెలిపారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ పార్టీలు ఇంకొంతమంది బీఎల్‌ఏలను నియమించాల్సి ఉందని, అలానే అన్ని రాజకీయ పార్టీలు బీఎల్‌ఏలను నియమించి సర్వేకు సహకరించాలన్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుబ్బారావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.